సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 29 । మే । 2023



మొక్కవోని సంకల్పం
పర్యావరణ పరిరక్షణకు ఏఎస్పీ హనుమంతు విశేష కృషి చేస్తున్నారు. 50 వేలకు పైగా మొక్కలు నాటించారు. 8లో



ఉద్యోగులకు పదోన్నతులు
పంచాయతీరాజ్ విభాగంలో ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. ఉమ్మడి జిల్లాలో 11 మందికి అవకాశం లభించింది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
41.6°/23.2°
జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం పడింది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



లేపాక్షి కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

లేపాక్షి: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 6 కేంద్రాల్లో 2,140 విద్యార్థులకు గానూ, 1,580 మంది పరీక్షలు రాశారని పరీక్ష జిల్లా కన్వీనర్ ప్రసాద్ పేర్కొన్నారు. 73.8 శాతం హాజరు నమోదైనట్లు ఆయన వివరించారు.

'ధర్మవరం' తాత్కాలిక చైర్‌పర్సన్‌గా భాగ్యలక్ష్మి



యర్రగుంట్ల భాగ్యలక్ష్మి

ధర్మవరం: ధర్మవరం మున్సిపాలిటీ తాత్కాలిక చైర్‌పర్సన్‌గా యర్రగుంట్ల భాగ్యలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న లింగం నిర్మల ఈ నెల 5న రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న యర్రగుంట్ల భాగ్యలక్ష్మిని తాత్కాలికంగా ఆ పదవిలో నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ యాక్ట్ ప్రకారం చైర్‌పర్సన్ వరుసగా 10 రోజులు విధులకు హాజరుకాని పక్షంలో వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించాలి. అందులో భాగంగానే వైస్ చైర్మన్ యర్రగుంట్ల భాగ్యలక్ష్మికి తాత్కాలిక చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించారు.

నేడు 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, సచివాలయ స్థాయిలో ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు ఉదయం 9.30 గంటల నుంచి అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.







పరీక్ష కేంద్రంలోకి పర్సు అనుమతించకపోవడంతో కుటుంబ సభ్యులకు అందిస్తున్న అభ్యర్థి, సివిల్స్ పరీక్షలు రాసేందుకు వస్తున్న అభ్యర్థులు, పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

సజావుగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష అనంతపురంలో సజావుగా జరిగింది. 8 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షకు 56.045 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 3,213 మంది అభ్యర్థులకు గానూ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు జరిగిన పేపర్–1 పరీక్షకు 1,814 మంది (56.45శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. 1,399 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన పేపర్–2 పరీక్షకు 1,788 మంది (55.64 శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. 1,425 మంది గైర్హాజరయ్యారు. ఎస్‌కేయూ, జేఎన్‌టీయూ, ఆర్ట్స్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్, తదితర పరీక్ష కేంద్రాలను యూపీఎస్సీ పరిశీలకుడు సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్, జేసీ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ తనిఖీ చేశారు.

పచ్చ..రచ్చ..!



- 'తమ్ముళ్ల' మధ్య కుదరని సయోధ్య
- ఇన్‌చార్జ్‌లపై సొంత పార్టీ నేతలే విమర్శలు
- పరస్పర అవినీతి ఆరోపణలతో రోడ్డున పడిన వైనం
- ఎవరి వెంట వెళ్లాలో తెలీక కార్యకర్తల అయోమయం
- అన్ని నియోజకవర్గాల్లోనూ తారస్థాయికి తగాదాలు

సాక్షి, పుట్టపర్తి: 'నువ్వు ఇసుక మేశావ్. నువ్వు 'నీరు–చెట్టు' పేరుతో దోచుకున్నావ్.. నువ్వేమైనా తక్కువా.. మరుగుదొడ్ల బిల్లులూ స్వాహా చేశావ్..' ఇలా టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఏ మేరకు అవినీతి చేశారో 'తమ్ముళ్లే' రోడ్డెక్కి మరీ చెబుతున్నారు. వాటాల్లో తేడా రావడం, పార్టీలో పట్టుకోసం ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారు.

ఇన్‌చార్జ్‌లపై తమ్ముళ్ల పోరుబాట..
జిల్లాలోని ఏ ఒక్క నియోజకవర్గంలోనూ టీడీపీ పరిస్థితి ఆశించిన మేర లేదు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న వారిపై సొంత పార్టీ నేతలే బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. ఈ సారి ఇన్‌చార్జ్‌లకు టికెట్ ఇస్తే పని చేసేది లేదని ద్వితీయ శ్రేణి నేతలు తేల్చి చెబుతున్నారు. పైగా సదరు నేత చేసిన అవినీతి పర్వాన్ని వెల్లడిస్తున్నారు. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగిన నేతలు తమ అనుచరులతో మీడియా సమావేశాలు పెట్టిస్తున్నారు. డబ్బుల కోసమే ద్వితీయ శ్రేణి నేతలు బెదిరింపులకు దిగుతున్నారని ఎదురుదాడి చేయిస్తున్నారు. జిల్లాలో రోజూ ఏదో ఒక నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి తలెత్తుతుండటంతో అధిష్టానం కూడా ఏమీ చేయలేని స్థితిలో పడిపోయింది.

అవినీతికి కేరాఫ్ టీడీపీ..
టీడీపీ హయాంలో (2014–19 వరకు) ఆ పార్టీ గ్రామ స్థాయి నేత నుంచి జిల్లా ముఖ్యనేతల వరకూ ఎవరికి దొరికినంత వారు దోచేశారు. ప్రజలను పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. దీంతో విసిగిపోయిన ప్రజలు 2019 ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెప్పారు. ఆ తర్వాత ఉనికి చాటుకునేందుకు టీడీపీ నేతలు నానా తంటాలు పడుతున్నారు.

తారస్థాయికి గ్రూపు తగాదాలు..
జిల్లాలో మడకశిర, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో టీడీపీ నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఆయా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌లపై సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండటం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ ఓటు బ్యాంకుకు గండిపడింది.

అన్ని నియోజకవర్గాల్లోనూ అంతే..
- పుట్టపర్తి నియోజకవర్గంలో పల్లె రఘునాథరెడ్డి అవినీతిపై పెదరాసు సుబ్రహ్మణ్యం మీడియా సమావేశం నిర్వహించారు. పల్లె చేసిన అవినీతికి ఓట్లు పడవని.. ఆయనకు టికెట్ ఇస్తే పని చేసేది లేదని సుబ్రమణ్యం తేల్చిచెప్పారు. దీనిపై పల్లె అనుచరులు స్పందిస్తూ.. డబ్బుల కోసం బెదిరింపులకు దిగడం పెదరాసు సుబ్రహ్మణ్యంకు అలవాటేనని చెబుతున్నారు.
- ఎస్సీ నియోజకవర్గమైన మడకశిర టీడీపీ బాధ్యతలు బీసీ సామాజిక వర్గానికి చెందిన గుండుమల తిప్పేస్వామికి ఇవ్వడంపై సొంత పార్టీలో అసమ్మతి మొదలైంది. ఎస్సీ రిజర్వుడు స్థానంలో బీసీ నేతల పెత్తనం ఎందుకన్న ప్రశ్నలు మొదలయ్యాయి. గుండుమల తిప్పేస్వామి అవినీతి, అక్రమాలతో బాగా సంపాదించారని, ఆ సొమ్ముతోనే పార్టీ పెద్దల వద్ద లాబీయింగ్ చేసి పదవులు పొందుతున్నారని దళిత వర్గం నేతలు విమర్శలు చేస్తున్నారు.
- కదిరిలో కుల రాజకీయం మొదలుపెట్టారు. చేనేతల ఓట్లు నాలుగు వేలు కూడా లేవని అత్తార్ చాంద్‌బాషా వర్గం గొడవ చేస్తోంది. అయితే తాను మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడ్డానని కందికుంట వెంకటప్రసాద్ చెబుతున్నారు. దీంతో కందికుంటపై ఉన్న కేసుల చిట్టా తీస్తున్న చాంద్ బాషా, అతను పోటీకే అనర్హుడని బహిరంగంగానే చెబుతున్నారు.
- ధర్మవరం నియోజకవర్గంలో పరిటాల శ్రీరామ్ ఆటలు సాగనివ్వకూడదని వరదాపురం సూరి వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. రాప్తాడు నుంచి పారిపోయి వచ్చిన వాడికి మద్దతు ఇవ్వరాదని చెబుతున్నారు. రాప్తాడులో అరాచకాలు చేసిన పరిటాల కుటుంబానికి అక్కడ ఓటు బ్యాంకు లేదని.. ధర్మవరంలో కూడా అడుగు పెట్టనివ్వకూడదని జోరుగా ప్రచారం చేస్తున్నారు.
- పెనుకొండ టికెట్ బీసీలకే ఇవ్వాలని బీకే పార్థసారథి పట్టుబట్టారు. కురుబ సవితమ్మ కమ్మ సామాజిక వర్గానికి చెందిన వెంకటేశ్వరరావును వివాహం చేసుకుందని.. ఆమె ఓసీ కేటగిరీలోకి వస్తుందని బీకే వర్గీయులు చెబుతుండటం గమనార్హం. కులాలను అడ్డు పెట్టుకుని ఓట్లు రాబట్టేందుకు బీకే ప్రయత్నిస్తున్నాడని సవితమ్మ వర్గం ప్రచారం చేస్తోంది. ఫలితంగా ఇరు వర్గాల మధ్య పోటీ నెలకొని గతంలో చేసిన అవినీతి విషయాలు బహిర్గతమవుతున్నాయి.

జేఎన్‌టీయూలో 3న క్యాంపస్ డ్రైవ్



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలోని సీమెన్స్ సెంటర్‌లో జూన్ 3న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఎల్.ఆనంద్ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మేథమేటిక్స్ లేదా బిజినెస్ మేథమేటిక్స్‌లో 2022 లేదా 2023లో ఇంటర్మీడియెట్ 60 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతతో పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాంకు ఎంపికైతే నెలకు రూ.10 వేల స్టైఫండ్, ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌తో ఏడాది శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం కల్పిస్తారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకుంటే ఐఐఎం, బిట్స్, శస్త్ర, కేఎల్ వర్సిటీల్లో స్కాలర్‌షిప్‌తో కొనసాగించవచ్చు. ఎడ్యుకేషనల్ ఫీజు పాక్షికంగా హెచ్‌సీఎల్ చెల్లిస్తుంది. ఆసక్తి గల అభ్యర్థులు క్యాంపస్ డ్రైవ్‌కు రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్‌తో మూడో తేదీ ఉదయం 8 గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 86880 30375 నంబర్‌లో సంప్రదించవచ్చు.

పేదలకు ఉచితంగా రాగులు

- వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ
- ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా సర్కారు చర్యలు
- జిల్లాలో 5.60 లక్షల మందికి లబ్ధి



ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ (ఫైల్)

జిల్లాలో చౌకదుకాణాలు	1,367
రేషన్ కార్డులు	5,60,914
ఎండీయూ వాహనాలు	349
సరఫరా అయ్యే బియ్యం	8,700 మెట్రిక్ టన్నులు
సరఫరా కానున్న రాగులు	560 మెట్రిక్ టన్నులు

పుట్టపర్తి అర్బన్: పేదల సంక్షేమమే పరమావధిగా విప్లవాత్మక చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా చౌకధాన్యపు డిపోల ద్వారా బియ్యంతో పాటు ఉచితంగా రాగులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల నుంచి ఒక్కో రేషన్ కార్డుదారునికి ఒకటి నుంచి మూడు కిలోల వరకూ రాగులు అందనున్నాయి. ఎండీయూ వాహనాల ద్వారా వీటిని ఇంటింటికీ పంపిణీ చేస్తారు. రాగుల బస్తాలను ఇప్పటికే 20 మండలాలకు చేరవేయగా తక్కిన మండలాలకు రెండు మూడు రోజుల్లో చేర్చనున్నారు.

పోషకాలు పుష్కలం..
చిరుధాన్యాల రకానికి చెందిన రాగులు అత్యధిక పోషకాలు కలిగి ఉంటాయి. పాస్ఫరస్, ఐరన్, ఫైబర్, కాల్షియం, జింక్ అధికంగా ఉంటాయి. వీటి వినియోగంతో మధుమేహవ్యాధి నియంత్రించవచ్చు. ఎముకల దృఢత్వం పెరుగుతుంది. గుండె పనితీరు మెరుగవుతుంది. జీర్ణ క్రియ ఉన్నతస్థితికి చేరుతుంది. శరీర బరువు తగ్గుతుంది. శరీరంలో వేడి తగ్గిస్తుంది. రాగులు నిత్యం తీసుకుంటే బాలింతల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇన్ని రకాల ఉపయోగాలు ఉండడం వల్లే ప్రజారోగ్య శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం కార్డుదారులకు ఉచితంగా రాగులను అందించనుంది.

ఫోర్టిఫైడ్ బియ్యం కూడా..
చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం బస్తాల్లో ఫోర్టిఫైడ్ బియ్యం కూడా కలపనున్నారు. క్వింటా బస్తాలో వంద గ్రాముల ఫోర్టిఫైడ్ బియ్యముంటుంది. ఇవి ఐరన్, కాల్షియం తదితర సూక్ష్మ పోషకాలు కలిగి ఉంటాయి. కడిగేందుకు గిన్నెలో నీళ్లపోసి వేయగానే ఫోర్టిఫైడ్ బియ్యంపైకి తేలుతాయి. ప్లాస్టిక్ అని పారపడకుండా వాటిని తిరిగి బియ్యంలో కలిపి ఉడికించి తినాలి. అధికారులు ఇప్పటికే వీడియోలు, యూట్యూబ్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇప్పటి వరకూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే అందిన ఫోర్టిఫైడ్ బియ్యం ఇకపై పేదలకు అందనున్నాయి.

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం అందజేసే రాగులు, ఫోర్టిఫైడ్ బియ్యం సద్వినియోగం చేసుకోవాలి. ఒక్కో కార్డుదారునికి కిలో నుంచి 3 కిలోల వరకూ పంపిణీ చేస్తారు. కిలో బియ్యం తగ్గించి రాగులు అందజేస్తాం. నీళ్లలో ఫోర్టిఫైడ్ బియ్యం పైకి తేలతాయి. వాటిని తీసి పారేయకుండా బియ్యంలో కలిపి ఉడికించి తినాలి. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాం.
– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

టవర్‌క్లాక్ బ్రిడ్జి రెడీ

- నేడు బైక్ ర్యాలీతో రాకపోకలు ప్రారంభం



అనంతపురం క్రైం: జిల్లా కేంద్రం అనంతపురంలో అత్యంత కీలకమైన టవర్‌క్లాక్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సిద్ధమైంది. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టే బైక్ ర్యాలీతో బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం బ్రిడ్జిపై ప్రత్యేక లైటింగ్‌ను కూడా ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు హాజరుకానున్నారు. అండర్ పాస్, ఇతరత్రా పనులు పూర్తయ్యాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రితో అధికారికంగా ఈ చారిత్రక బ్రిడ్జిని ప్రారంభించనున్నారు.

నేషనల్ హైవేగా మార్పు చేసి...
అనంతపురం టవర్‌క్లాక్ – పీటీసీ రైల్వే ఓవర్ బ్రిడ్జిని 1965లో నిర్మించారు. ఐదు దశాబ్దాల తర్వాత బ్రిడ్జి అక్కడక్కడా దెబ్బతినడం, వాహనాలకు అనుగుణంగా రోడ్డు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. నేషనల్ హైవేస్ పరిధిలో ఉన్న ఈ బ్రిడ్జిని 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో అభివృద్ధికి ప్రతిబంధకంగా మారింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా టవర్‌క్లాక్ బ్రిడ్జి విస్తరించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని భావించారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బ్రిడ్జిని 2020 నవంబరులో నేషనల్ హైవేస్ పరిధిలోకి తీసుకొచ్చారు. 2021 మే 3న బళ్లారి బైపాస్ వద్ద జాతీయ రహదారి– 44ను కలుపుతూ నగర శివారు పంగల్ రోడ్డు వద్దనున్న చెన్నై హైవేకి అనుసంధానిస్తూ కేంద్రం రూ.311.93 కోట్లతో అర్బన్ ప్రాజెక్ట్ చేపట్టేలా చర్యలు తీసుకుంది. టవర్‌క్లాక్ బ్రిడ్జి సహా 9.2 కిలోమీటర్ల పొడవున రోడ్డు పనులు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 720 మీటర్ల(దాదాపు 1.44 కి.మీ) పొడవున రెండు వైపులా (ఫోర్‌వే) బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2021 అక్టోబర్ 25న మొదలైన పనులు ఈ ఏడాది అక్టోబర్ 24కు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఐదు నెలలు ముందుగానే కాంట్రాక్ట్ సంస్థ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసింది.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

- ఎనుములపల్లి వద్ద లాంఛనంగా ప్రారంభించనున్న కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ విత్తన వేరుశనగ పంపిణీ సోమవారం ప్రారంభం కానుంది. మండలంలోని ఎనుములపల్లి వద్ద కలెక్టర్ అరుణ్‌బాబు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. సుమారు లక్ష క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయల పంపిణీకి వ్యవసాయ శాఖ అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇప్పటికే జిల్లాలోని 416 రైతు భరోసా కేంద్రాలకు కాయలు సరఫరా చేశారు. వేరుశనగతో పాటు కంది, రాగులు, కొర్రలు, పెసలు, జీలుగ పంపిణీ చేయనున్నారు. కే–6 రకంతో పాటు కదిరి లేపాక్షి 1812 సిద్ధంగా ఉంచారు. రైతులు ఏ రకం రిజిస్ట్రేషన్ చేసుకుంటే అవే అందజేస్తారు. ఆర్‌బీకే సిబ్బందికి రసీదు చూపించి విత్తన కాయల బస్తాలు తీసుకెళ్లవచ్చు. జిల్లాలో సుమారు 40 వేల మంది రైతులు 35 వేల క్వింటాళ్ల వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ నిధులు సైతం ప్రభుత్వం జమ చేయనుండడంతో విత్తనం కోసం రిజిస్ట్రేషన్లు మరింత పెరిగే అవకాశముందన్నారు.



పెడపల్లి రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

క్లుప్తంగా

తప్పిన పెను ప్రమాదం



చెల్లాచెదరుగా పడి ఉన్న పైపులు

పెనుకొండ: హిందూపురం నుంచి హైదరాబాద్‌కు పైపుల లోడుతో వెళ్తున్న లారీ విద్యుత్ తీగలు తగలడంతో బోల్తా పడింది. అయితే ప్రాణాపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల వివరాల మేరకు... పెనుకొండకు చెందిన ఓ లారీ ఇనుప పైపులను హిందూపురంలో లోడ్ చేసుకొని హైదరాబాద్‌కు బయల్దేరింది. శనివారం అర్ధ రాత్రి సమయంలో లారీ డ్రైవర్ పెనుకొండలో ఆగాలని భావించాడు. 44వ జాతీయ రహదారి నుంచి కృష్ణదేవరాయ వైజంక్షన్ వద్ద పెనుకొండ వైపునకు డ్రైవర్ ఫక్రుద్దీన్‌లారీని మళ్లించాడు. అయితే లోడు ఎత్తుగా ఉండడంతో ఆ దారిలో 11కేవీ విద్యుత్ తీగలు లారీని తాకాయి. దీంతో ఒక్కసారి తీగలు తెగి, లారీ బోల్తా పడింది. లారీలోని ఇనుప పైపులు, విద్యుత్ తీగలు రోడ్డుపై పడిపోయాయి. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు ఆరాతీశారు. ఈ ఘటనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్



కోడిపందెం రాయుళ్లను అరెస్టు చూపుతున్న పోలీసులు

కొత్తచెరువు: మండలంలోని మైలసముద్రం గ్రామ సమీపంలోని మల్లప్పకొండ వద్ద కోడి పందేల స్థావరంపై ఆదివారం ఎస్ఐలు లింగన్న, నరసింహులుతో కలసి దాడులు నిర్వహించినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. ఇందులో భాగంగానే 12 మంది జూదరులను అరెస్ట్ చేశామన్నారు. 8 ద్విచక్ర వాహనాలు, 11 సెల్‌ఫోన్లు రూ.5,190 నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరికొందరు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని కూడా అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు.

మొక్కవోని సంకల్పం



అనంతపురం ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏఎస్పీ హనుమంతు

- పర్యావరణ పరిరక్షణకు ఏఎస్పీ హనుమంతు విశేష కృషి
- ఎక్కడ పనిచేసినా మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ
- ఇప్పటికే 50 వేలకు పైగా మొక్కలు నాటించిన వైనం
- సిబ్బంది, విద్యార్థుల్లోనూ పర్యావరణంపై స్పృహ కలిగేలా ప్రేరణ

అనంతపురం డెస్క్:

ప్రకృతిని ఆరాధించడమంటే పరమాత్మను పూజించడమేనని పెద్దలు చెబుతుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆయన పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నారు. ఒకవైపు పోలీసు శాఖలో ఉన్నతాధికారిగా పనిచేస్తూనే..మరోవైపు మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇప్పటికే వేలాది మొక్కలను నాటించి..సంరక్షించారు. ప్రకృతిపై ఆరాధనను తాను పెంపొందించుకోవడమే కాకుండా కిందిస్థాయి సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు కూడా ఆ బాటలో పయనించేలా కృషి చేస్తున్నారు. ఆయనే.. ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఏఎస్పీ)గా పనిచేస్తున్న ఎ.హనుమంతు.

అలా మొదలైంది..

ఏఎస్పీ హనుమంతు స్వగ్రామం శ్రీఅన్నమయ్య జిల్లా కలికిరి మండలం తెల్లగుట్టపల్లి. 1991 సంవత్సరంలో రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్ఐ)గా పోలీసు శాఖలో చేరారు. 1999లో రిజర్వు ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా పదోన్నతి లభించింది. తర్వాత గ్రేహౌండ్స్ విభాగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో పని చేశారు. గ్రేహౌండ్స్‌లో ఉన్నప్పుడు ఖాళీ సమయం దొరికేది. ఆ సమయంలో మొక్కలు నాటడం ప్రారంభించారు. గ్రేహౌండ్స్ ఆపరేషన్లలో భాగంగా ఎక్కడికెళ్లినా అక్కడ మొక్కలు నాటేవారు. అలా మొదలైన అలవాటు కాస్త ప్రకృతిని ఆరాధించే స్థాయికి తీసుకెళ్లింది. డీఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత మొక్కల పెంపకాన్ని మరింత విస్తృతం చేశారు. కిందిస్థాయి సిబ్బంది సహకారంతో విజయనగరం, కల్యాణి డ్యాం (తిరుపతి), కడప డీటీసీ తదితర చోట్ల వేలాది మొక్కలు నాటించారు.

ధ్యానం.. మారిన దృక్పథం..

పోలీసు శాఖలో పనిఒత్తిడి సహజం. బయటపడాలంటే వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి అవసరం. దీంతో హనుమంతు కూడా ధ్యానంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా 2014లో పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు సుభాష్ పత్రీజీ తరగతులకు హాజరయ్యారు. ఆయన ఉపదేశాలు హనుమంతు దృక్పథాన్ని పూర్తిగా మార్చివేశాయి. శ్వాస మీద ధ్యాస పెట్టడమే ధ్యానం. శ్వాసకు మూలమైన గాలిని ఇచ్చేవి చెట్లు. దీంతో చెట్లను ఆరాధిస్తే ఈశ్వరుడ్ని ఆరాధించినట్లేనన్న పత్రీజీ బోధనలు బాగా ప్రభావితం చేశాయి. మొక్కల పెంపకాన్ని మరింత విస్తృతం చేశారు. సకల జీవరాశి మనుగడ మొక్కలపైనే ఆధారపడిందన్న వాస్తవాన్ని పాఠశాలలు, కళాశాలలు, ఇతరత్రా వేదికలపై ప్రచారం చేస్తున్నారు.

ఉద్యమంలా చేపట్టాలని..

మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టేందుకు అనంత ప్రకృతి ఫౌండేషన్ అనే సంస్థను ఇటీవలే నెలకొల్పారు. ఇందులో భాగంగా సేవా, ధార్మిక సంస్థలతో కలసి పనిచేస్తున్నారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నర్సరీ సైతం నిర్వహిస్తున్నారు. ఇందులో వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలకు సైతం అందిస్తున్నారు.

మొక్క నిత్యాన్నదానం చేస్తుంది



సకల జీవరాశి మనుగడ మొక్కలపైనే ఆధారపడి ఉంది. గాలి, పండ్లు మొదలుకుని..ప్రతి ఒక్కటీ అందిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే మొక్క నిత్యాన్నదానం చేస్తుంది. జీవరాశితో పాటు ప్రకృతిని కాపాడుతుంది. నా దృష్టిలో మొక్క ఈశ్వరుడితో సమానం. ఈశ్వరుడు ఎలాగైతే విషాన్ని తన కంఠంలో పెట్టుకుని లోకాన్ని కాపాడాడో.. మొక్క కూడా విషవాయువులను తాను పీల్చుకుని స్వచ్ఛమైన గాలిని మనకు అందిస్తోంది. ప్రతిఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలి.

– ఎ.హనుమంతు, ఏఎస్పీ (ఏఆర్)



సిద్ధరాంపురం పోలీసు లేఅవుట్‌లో మొక్కలకు నీరు పెడుతున్న ఏఎస్పీ హనుమంతు

50 వేలకు పైగా మొక్కల పెంపకం..

ఏఎస్పీ హనుమంతు ఇప్పటిదాకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 50 వేలకు పైగా మొక్కలు నాటించారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే పది వేల మొక్కలు నాటించారు. జిల్లాలోని నాగలాపురం, సోమలాపురం, నార్పల, వెంకటాపురం, సిద్ధరాంపురం పోలీసు లేఅవుట్, ఫైరింగ్ రేంజ్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ (అనంతపురం) తదితర ప్రాంతాల్లో ఆయన నాటించిన మొక్కలు పెరిగి పెద్దవవుతున్నాయి. కేవలం మొక్కలు నాటించడంతోనే తన బాధ్యత పూర్తయిందని అనుకోలేదు. వాటి సంరక్షణనూ చేపడుతున్నారు. తీరిక దొరికినప్పుడల్లా వెళ్లి ప్రతి మొక్కనూ పరిశీలించి..అక్కడి సిబ్బందికి తగిన జాగ్రత్తలు చెప్పి వస్తున్నారు. మొక్కల సంరక్షణలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో పాటు ఆర్డీటీ, కొందరు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు సహకారం అందిస్తున్నారు.



సిద్ధరాంపురం పోలీసు లేఅవుట్‌లో పెరిగి పెద్దవవుతున్న మొక్కలు

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

పరిగి: జిల్లా పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పరిగి మండల కేంద్రంలో సాయికుమార్‌రెడ్డి (27) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు ... సాయికుమార్‌రెడ్డి ఎంబీఏ చదివాడు. శనివారం రాత్రి ఇంట్లోని గదిలోకి సాయి నిద్రించేందుకు వెళ్లాడు. ఆదివారం ఉదయం ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుని తండ్రి సంజీవ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

క్యాన్సర్‌తో బాధపడుతూ...

మడకశిర(అగళి): అగళి చెరువులో దూకి మెకానిక్ ఆత్మహత్య చేసుకున్నట్లు సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.... అగళికి చెందిన హనుమంతరాయ అలియాస్ మెకానిక్ హనుమంతి (36) స్థానికంగానే ఓ షాపులో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అవివాహితుడైన హనుమంతరాయ కొన్నేళ్ల నుంచి ఇతను క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకుంటున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఆదివారం తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంతో సహా అగళి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు.

అమరాపురంలో యువకుడు...

అమరాపురం: మండలంలోని హాలుకూరుకు చెందిన వీఆర్ఏ మంజుల కుమారుడు మోహిత్‌సూర్య (18) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య ఆదివారం చేసుకున్నారు. ఎస్ఐ.వెంకటేశ్వర్లు, మృతుడి తల్లి మంజుల వివరాల మేరకు.. మోహిత్‌సూర్య ఇంటర్ పూర్తి చేశాడని, బెంగళూరులోనే ఉన్నత చదువు అభ్యసిస్తానని చెప్పేవాడన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల అది సాధ్యం కాదని చెప్పడంతో మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా అపూర్వ సమ్మేళనం



40 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1983–85 సంవత్సరాల్లో పదో తరగతి, ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ధర్మవరంలోని సీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తర్వాత మళ్లీ అంతా ఒక్కచోట చేరడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. అప్పటి ప్రిన్సిపాల్ నాగరాజు రావు, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, విద్యాసాగర్, బాబయ్య, సంజీవప్ప, ఊకా అశ్వర్థనారాయణ, రామమోహన్ తదితరులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారంతా కష్టసుఖాలను ఒకరికొకరు పంచుకొని ఆనందంగా గడిపారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

బొమ్మగుప్ప: మండల పరిధిలోని నక్కపల్లికి చెందిన పోలేరమ్మ ఆలయంలో శనివారం రాత్రి దొంగలు వెండి ఆభరణాలను దొంగలించారు. రోజూ మాదిరే ఆదివారం కూడా ఉదయాన్నే దేవాలయానికి వెళ్లిన అర్చకులు ఉలిగప్ప ఆలయ తలుపులు తెరచి ఉండటంతో గమనించారు. సుమారు 30 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. గ్రామస్తులతో కలసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని ఎస్ఐ రామకృష్ణయ్య పరిశీలించారు.

పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతులు



జిల్లా పరిషత్ కార్యాలయ భవనం

- రాష్ట్ర వ్యాప్తంగా 205 మంది ఏఓలు, ఈఓపీఆర్‌డీలకు ప్రమోషన్లు
- 'ఉమ్మడి అనంత' జిల్లాలో 11 మందికి దక్కిన అవకాశం

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నాళ్ల నుంచో పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న పరిపాలనాధికారులు, ఈఓపీఆర్‌డీల కలను సాకారం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 400కు పైబడి ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రస్తుతం పదోన్నతుల ద్వారా 205 మందికి ఎంపీడీఓలుగా అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో 112 మంది ఏఓలు ఉండగా, 93 మంది ఈఓపీఆర్‌డీలు ఉన్నారు.

'అనంత' జిల్లాలో 11 మందికి ఛాన్స్..

ఉమ్మడి అనంతపురం జిల్లా విషయానికొస్తే.. 11 మందికి ఇప్పుడు పదోన్నతులు దక్కాయి. వారిలో ఆరుగురు పరిపాలనాధికారులు (ఏఓలు) ఉండగా, ఐదుగురు ఈఓపీఆర్‌డీలు ఉన్నారు. వారందరినీ జిల్లాలకు కేటాయిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వెంటనే విధుల్లో చేరాలి..

పదోన్నతులపై వివిధ జిల్లాలకు కేటాయించిన పరిపాలనాధికారులు, ఈఓపీఆర్‌డీలు వెంటనే తమకు కేటాయించిన జిల్లాలకు వెళ్లిపోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలకు వెళ్లి రిపోర్ట్ చేసుకున్న తరువాత మండలాలు కేటాయిస్తారని స్పష్టం చేశారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..

తాము ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూశామని, ఇన్నాళ్లకు తమ కల నెరవేరిందుకు ఆనందంగా ఉందని పదోన్నతి పొందిన ఏఓలు, ఈఓపీఆర్‌డీలు తెలిపారు. పాతికేళ్ల తరువాత ఎంపీడీఓలను డీఎల్‌డీఓలుగా పదోన్నతి కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ... ఇప్పుడు తమకు ఎంపీడీఓలుగా అవకాశం కల్పించారని హర్షం వ్యక్తం చేశారు.

పదోన్నతి పొందిన వారి వివరాలు ఇలా..

అధికారి పేరు	హోదా	ప్రస్తుత ప్రదేశం	పదోన్నతిపై కేటాయించిన జిల్లా
పి.మైథిలి	ఏఓ	చెన్నేకొత్తపల్లి	అనంతపురం
పి.కృష్ణమోహన్‌బాబు	ఏఓ	జిల్లా పరిషత్	శ్రీసత్యసాయి
ఎ.జాషువా	ఏఓ	గుంతకల్లు	అన్నమయ్య
ఎల్.నారాయణస్వామి	ఏఓ	కుందుర్పి	అన్నమయ్య
జీఎస్ రామచంద్ర	ఏఓ	ధర్మవరం	అనంతపురం
ఎస్.నరసింహమూర్తి	ఏఓ	మడకశిర	అనంతపురం
గంగావతి	ఈఓపీఆర్‌డీ	శెట్టూరు	శ్రీసత్యసాయి
అలివేలమ్మ	ఈఓపీఆర్‌డీ	అనంతపురం రూరల్	శ్రీసత్యసాయి
సౌజన్యకుమారి	ఈఓపీఆర్‌డీ	కూడేరు	శ్రీసత్యసాయి
విజయలక్ష్మి	ఈఓపీఆర్‌డీ	బత్తలపల్లి	శ్రీసత్యసాయి
నరసింహులు	ఈఓపీఆర్‌డీ	చెన్నేకొత్తపల్లి	శ్రీబాలాజీ

ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు రానున్న ఎంపీడీఓలు

అధికారి పేరు	హోదా	ప్రస్తుతం	కేటాయించిన జిల్లా
ఎం.సుధాకర్‌రాజు	ఏఓ	కర్నూలు	అనంతపురం
కె.విజయశేఖర్‌రావు	ఏఓ	కర్నూలు	అనంతపురం
ఎస్.బసా నాయక్	ఏఓ	కర్నూలు	అనంతపురం
పి.విజయలలిత	ఏఓ	కర్నూలు	అనంతపురం
బి.కృష్ణమోహన్‌రావు	ఏఓ	వైఎస్సార్	అనంతపురం
సి.వెంకటరమణప్ప	ఈఓపీఆర్‌డీ	కర్నూలు	అనంతపురం
వై.పుల్లయ్య	ఈఓపీఆర్‌డీ	నంద్యాల	అనంతపురం
బి.వీరరాజు	ఈఓపీఆర్‌డీ	నంద్యాల	అనంతపురం
ఐ.సాల్మన్	ఈఓపీఆర్‌డీ	నంద్యాల	అనంతపురం
కె.వరలక్ష్మి	ఈఓపీఆర్‌డీ	కర్నూలు	శ్రీసత్యసాయి

జాతీయ శిక్షణ శిబిరానికి ఎంపిక



కిరణ్మయిని అభినందిస్తున్న బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: బాస్కెట్‌బాల్ జాతీయ శిక్షణ శిబిరానికి ధర్మవరం క్రీడాకారిణి కిరణ్మయి ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్ బాల్ కోర్టులో ఆదివారం సాయంత్రం నేషనల్ క్యాంపునకు ఎంపికైన క్రీడాకారిణి కిరణ్మయిని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. ఆత్మీయ ట్రస్ట్ వైస్ చైర్మన్ సూర్యప్రకాష్ క్రీడాకారిణి కిరణ్మయికి రూ.5 వేలు నగదును బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



బాలచంద్ర (ఫైల్)

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గ్రామంలో విద్యుదాఘాతంతో ఎరుకులవాండ్లపల్లి చెందిన బాలచంద్ర (24) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాలమేరకు... కదిరిలోని డిజిటల్ టీవీలో బాలచంద్ర కూలిగా పనిచేస్తున్నారు. ఆదివారం టీవీ కేబుల్ పని నిమిత్తం కాళసముద్రంలో విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసుకుని ఎక్కుతుండగా అప్పటికే స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతుండటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ మండల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలచంద్ర తండ్రి ఇప్పటికే చనిపోగా తల్లి రమణమ్మతో కలసి జీవనం సాగిస్తున్నారు. బాలచంద్ర మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రేపటి నుంచి అభ్యాస వర్గ సమావేశాలు



సమావేశంలో పాల్గొన్న ఆపస్ నాయకులు

రాప్తాడురూరల్: పుట్టపర్తిలో 30, 31 తేదీల్లో జరిగే ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) అభ్యాస వర్గ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఆపస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆపస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంఘం ఆధ్వర్యంలో ఏదో ఒక ప్రాంతంలో అభ్యాస వర్గ సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం పుట్టపర్తిలో నిర్వహించాలని రాష్ట్ర శాఖ నిర్ణయించిందన్నారు. ఈ సమావేశాల్లో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ, విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తి పెంపొందించేందుకు శిక్షణ ఇస్తారన్నారు. రాష్ట్ర బాధ్యులు, 26 జిల్లాల నుంచి జిల్లాకు ఆరుగురు చొప్పున ఈ అభ్యాస వర్గ సమావేశాలకు హాజరవుతారన్నారు. సమావేశంలో శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అమరా చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, హర్ష, రమేష్ ,అరవింద్ పాల్గొన్నారు.

ఉరవకొండలో దొంగల హల్‌చల్

- 21 తులాల బంగారు, 30 తులాల వెండి, నగదు అపహరణ



దొంగతనం జరిగిన నజీర్ ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

ఉరవకొండ: పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. పక్కపక్కనే ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. స్థానికుల వివరాలమేరకు... స్థానిక ఇంద్రానగర్ 9వ లైన్‌లో నివాసముంటున్న ప్రైవేటు ఎలక్ట్రీషియన్ నజీర్ తన ఇంటికి తాళం వేసి ఉక్కపోత కారణంగా ఇంటి పక్కన ఉన్న వరండాలో కుటుంబ సభ్యులతో నిద్రపోయారు. శనివారం అర్ధరాత్రి దొంగలు నజీర్ ఇంటికి వేసిన తాళాలను కటర్ సాయంతో కట్ చేసి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో దాచిన 18 తులాల బంగారు, 30 తులాల వెండి, రూ.లక్ష నగదు దోచుకెళ్లారు. తెల్లవారుజామున ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన నజీర్ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు ధ్వంసం చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అలాగే నజీర్ ఇంటి పక్కనే నివాసముంటున్న కార్పెంటర్ దయానంద అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజుల క్రితం తిరుమలకు వెళ్లారు. దొంగలు వారి ఇంటి తాళాలను ధ్వంసం చేసి బీరువాలో ఉన్న మూడు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. దయానందకు చోరీ విషయాన్ని స్థానికులు తెలియజేయడంతో తిరుమల నుంచి హుటాహుటినా తిరుగు ప్రయాణమయ్యారు. సీఐ హరినాథ్ సిబ్బందితో పాటు క్లూస్ టీంతో కలిసి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు.